క్లుప్తంగా

నేటి నుంచి జనుము విత్తనాలు పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలో సోమవారం నుంచి జనుము విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. క్వింటాలు జనుము విత్తనాల ధర రూ.9050 కాగా రాయితీ రూ.5430 పోను మిగిలిన రూ.3620 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకంతో పంపిణీ కేంద్రానికి రావాలని సూచించారు.

ఈఏపీ సెట్‌లో విద్యార్థిని ప్రతిభ


సాయికీర్తన

జిన్నారం (పటాన్‌చెరు): ఇటీవల నిర్వహించిన ఈఏపీ సెట్ అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో జిన్నారానికి చెందిన వి.సాయికీర్తన 3340 ర్యాంక్ సాధించి సత్తా చాటింది. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో తాను మంచి ర్యాంక్ సాధించినట్లు సాయికీర్తన తెలిపింది. నీట్‌లో మంచి మార్కులు సాధించి వైద్య వృత్తిని ఎంచుకోవాలన్నదే తన లక్ష్యమని, వచ్చే నీట్ ఫలితాల్లో సైతం మంచి మార్కులు సాధిస్తానని ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో తల్లిదండ్రులు దేవిశ్రీ, ఆనంద్‌తో పాటు పలువురు సాయికీర్తనను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన నిజాంపేట్ మండల కేంద్రం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్గాపూర్ మండల పరిధిలోని నాగధర్ గ్రామానికి చెందిన బోయి దుర్గయ్య తన ద్విచక్రవాహనంపై నిజాంపేట వైపు నుంచి నారాయణఖేడ్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో నిజాంపేట సమీపానికి రాగానే మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన దుర్గయ్యను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

డాక్టర్ ఆదిత్యరెడ్డికి సన్మానం


ఆదిత్యరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రోటోకాల్ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ఆదిత్యరెడ్డిని పటాన్‌చెరు పట్టణంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అతిక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

జొన్న రైతులకు అండగా ఉంటాం

కల్హేర్(నారాయణఖేడ్): జొన్న సాగు చేసిన రైతులకు అండగా ఉంటామని మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లోడ్డి తుకరాం అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగిలో పండించిన జొన్నలకు అధిక దిగుబడి వచ్చిందని గుర్తు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కృషితో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రాంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కల్హేర్, మార్డి, కృష్ణాపూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



నారాయణఖేడ్: విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లింగనాయక్‌పల్లి శివారులోని గౌరారం తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన వాల్యానాయక్ ఎప్పటిలాగే తన గేదెను మేత కోసం ఆదివారం తండా సమీపంలోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో పాడిగేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వాల్యానాయక్, తండావాసులు కోరుతున్నారు.

ఉల్లాసం.. ఉత్సాహం

- వేసవి శిబిరాలపై పిల్లల ఆసక్తి
- వివిధ అంశాల్లో అనుభవజ్ఞులైన నిష్ణాతులతో శిక్షణ
- విజ్ఞాన కేంద్రాలుగా వేసవి శిబిరాలు
- ఉత్సాహం చూపుతున్న చిన్నారులు

కాలంతో పాటు పిల్లల అలవాట్లలో కూడా మార్పులు వస్తున్నాయి. పట్టణ ప్రాంతంలో అభిరుచికి తగ్గట్టు అవకాశాలు లభిస్తుండటంతో వివిధ అంశాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. పిల్లల ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాల్లో చేర్పిస్తున్నారు. వేసవి సెలవులు వచ్చాయంటే గతంలో ఎక్కువమంది తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పల్లెలకు పయనమయ్యేవారు. గల్లీపిల్లలతో ఆటలాడుకోవడం.. పంట పొలాల చుట్టూ తిరగడం వంటివి చేసేవారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో పెరుగుతున్న ఎండల కారణంగా గ్రామాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొవడం కంటే పట్టణంలోనే ఉంటూ పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలకు పంపుతున్నారు. పిల్లలకు కూడా శిబిరాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. పిల్లలను ఆయా అంశాల్లో నిష్ణాతులను చేసేందుకు శిక్షణ ఇచ్చే మాస్టర్లకు నెలకు రూ.2వేల వరకు చెల్లిస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్


కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ శ్రీకాంత్

పిల్లలకు వేసవి నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు కొత్తది నేర్చుకున్న అనుభూతి కలిగించాలనే ఉద్దేశంతో పలు అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. డ్యాన్స్ మాస్టర్ రాజు జహీరాబాద్ పట్టణంలో ట్రెయినింగ్ సెంటర్ ఏర్పాటు చేసి పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. నిర్వాహకులు ప్రతిరోజు ఐదారు గంటల పాటు డ్యాన్సింగ్, డ్రాయింగ్, క్రాఫ్ట్, యోగ, క్యారం, అబాకస్, ఇండోర్ గేమ్స్, చెస్, సంగీతం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. వేసవిలో కొత్త విషయాలు నేర్చుకొనేందుకు బాలబాలికలు ఉత్సాహం చూపుతున్నారు. కరాటే మాస్టర్ శ్రీకాంత్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో పిల్లలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పంచ్, మూవింగ్, టర్నింగ్ కటాస్, వెపన్ కటాస్, బ్లాక్, డౌన్ బ్లాక్, అప్పర్ బ్లాక్, యూనిపాన్ బ్లాక్, ఫ్రంట్ కిక్, స్లాప్ కిక్‌లతో పాటు యోగా, ధ్యానం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. పిల్లలతో పాటు పెద్దలకు కూడా శిక్షణ కేంద్రాలు వెలిశాయి. పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అకాడమిలో యువతకు క్రికెట్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు.


డ్యాన్స్ నేర్చుకుంటున్న పిల్లలు

ఆసక్తి చూపుతున్నారు



కరాటే శిక్షణ పట్ల పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. కొన్నేళ్ల నుంచి పట్టణంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాను. ఈ ఏడాది శిక్షణ పొందడానికి అధిక సంఖ్యలో చిన్నారులు వస్తున్నారు. పిల్లలకు శిక్షణ ఇవ్వడంతో పాటు కరాటే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అకాశం కల్పిస్తున్నాను. ఆత్మరణక్షతో పాటు శారీరక ధృడత్వానికి కరాటే దోహదం చేస్తుంది.

– శ్రీకాంత్, కరాటే మాస్టర్,

మంచి స్పందన ఉంది



వేసవి విశిబిరానికి మంచి స్పందన వస్తోంది. సుమారు 100 మంది పిల్లల వరకు శిబిరానికి వస్తున్నారు. ఐదారు మంది శిక్షకులు పలు అంశాల్లో ట్రెయినింగ్ ఇస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నాను. ఈ సంవత్సరం ఎక్కువ మంది పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. వేసవి శిక్షణ శిబిరానికి మంచి స్పందన వస్తోంది.

– రాజు, డ్యాన్స్ మాస్టర్

సుందరయ్య జీవితం.. ఆదర్శం


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి టౌన్: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం భావి తరాలకు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. ధనిక కుటుంబంలో పుట్టి నిరంతరం పేదల సంక్షేమం కోసం పోరాడిన నాయకుడు సుందరయ్య అని వివరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటం చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, మాణిక్, సాయిలు, ఆఫీస్ కార్యదర్శి కృష్ణ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగించాలి

సదాశివపేట(సంగారెడ్డి): పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన గొప్ప పోరాట యోధుడు సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌గౌడ్, మల్లేశం, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు సమారోప్

నారాయణఖేడ్: ఖేడ్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో సంస్కార సాధనా వర్గ వేసవి శిక్షణా శిబిరం 2024 ముగింపును ఈ నెల 20న ఘనంగా నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రబంధ కారిణి కమిటీ బాధ్యులు, ఆచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి బాలబాలికలు నేర్చుకున్న వివిధ అంశాల ప్రదర్శన కోసం సమారోప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పోషకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా భూలక్ష్మిదేవి ఆలయ ఉత్సవాలు


ఆలయం వద్ద బోనాలతో మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని టేకూర్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన భూలక్ష్మిదేవి ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం ఆలయం ఆవరణలో హోమం, ప్రత్యేక పూజలు, బోనాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వరకు మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాలు సోమవారం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

సంగారెడ్డి టౌన్: ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక చోట్ల తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కలెక్టర్, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తక్షణ సాయం అందించాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గన్య తండాకు చెందిన విఠల్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పాండరి రూ.1.45లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. విఠల్ కూతురు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితుడి విజ్ఞప్తి మేరకు వారు ఆదివారం ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంద్రయ్య, దేవిచంద్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌ఓసీ అందజేస్తున్న నేతలు

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది


దుర్గాప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని పూర్వ విద్యార్థులు అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని పెద్దకంజర్లలో గౌతమి పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా పూర్వ విద్యార్థులు సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1984 నుంచి 2024 వరకు ఆయన వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమకు పాఠాలు బోధించిన దుర్గాప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమాన్ని అందరం కలిసి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం దుర్గాప్రసాద్ దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

పెళ్లింట విషాదం

విద్యుదాఘాతంతో వధువు పెద్దమ్మ మృతి

పుల్‌కల్(అందోల్) : విద్యుదాఘాతంతో వధువు పెద్దమ్మ మృతి చెందటంతో పెళ్లింట విషాదం నెలకొంది. ఈ సంఘటన మండల కేంద్రం పుల్కల్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం పుల్‌కల్‌కు చెందిన మ్యాతరి గంగమ్మ(45) ఇంట్లో పెళ్లిసంబురాలు జరుగుతున్నాయి. సోమవారం అందరు పెళ్లి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. నీటి కోసం గంగమ్మ మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త అంజయ్య రెండేళ్ల క్రితం మృతిచెందారు.


మేళ్ల చెరువును శుభ్రం చేస్తున్న నైబర్‌హూడ్ అసోసియేషన్ సభ్యులు


శుభ్రం అనంతరం మేళ్ల చెరువు పరిసరాలు

చెరువులను పరిరక్షించుకుందాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవ్ లేక్స్..సేవ్ వాటర్ కార్యక్రమంలో భాగంగా తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే నైబర్ హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక కాలనీల వాసులతో కలిసి గ్రీన్ ఆర్మీ గ్రూపును ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆదివారం తెల్లాపూర్ పరిధిలోని చెరువుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు పరిసరాలను శుభ్రం చేస్తామని వివరించారు. చెరువుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మేళ్ల చెరువును శుభ్రం చేయడంలో 50 మంది వివిధ కాలనీల వాసులు, తెల్లాపూర్ వాసులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్‌కల్(అందోల్): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు తీరుపై రైతులతో పాటు సీఈఓను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడమే కాకుండా కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం.. రాజకీయ జోక్యం అధికంగా ఉండటంతో ధాన్యం తరలించడంలో ఆలస్యమవుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి లారీల సంఖ్యను పెంచి ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్‌కల్ ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, ప్యాక్స్ డైరెక్టర్ మహేశ్‌బాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, సిద్దయ్య, లోకేష్, విష్ణయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1998-99 పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిరం ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రజతోత్సవ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, ఆర్‌ఎస్‌ఎస్ మాజీ జిల్లా శారీరక్ ప్రముఖ్ కష్టయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తమ పిల్లలను భావి తరాలను ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యోగా ప్రశిక్షకుడు నారాయణరెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు నర్సింహులు, విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్‌గుప్తా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైన నగర సంకీర్తన విజయవంతంగా కొనసాగుతోంది. ప్రతి ఆదివారం అధికసంఖ్యలో భక్తులు నగర సంకీర్తనలో పాల్గొని దైవనామస్మరణ చేస్తున్నారు. ఈ వారం పట్టణంలోని ఆదర్శనగర్, దత్తగిరి కాలనీలో భజనలు కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందజేశారు.


నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మాజీ సైనికుడి ఉదారత


బోరుమోటారు వేయిస్తున్న రాజు

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రాజు తన సొంత డబ్బుతో బోరుమోటారు వేయించాడు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలోని సిద్దేశ్వర ఆలయం ప్రాంతంలో ఆదివారం బోరుమోటారు తవ్వించగా నీళ్లు పడ్డాయి. గ్రామానికి చెందిన ముదిరాజ్ రాజు సైన్యంలో పనిచేసి పదవీ విరమణ పొందాడు. సొంత ఊరుకు ఏదో చేయాలని తాపత్రయంతో గ్రామస్తుల కోరిక మేరకు రూ.60వేలు ఖర్చు చేసి బోరుమోటార్ వేయించాడు. ఈ సందర్భంగా ఉదారత చాటుకున్న మాజీ సైనికుడు రాజును గ్రామస్తులు అభినందించారు.

భారీ వర్షం.. రైతులకు నష్టం

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షం వల్ల మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, దొంతి, పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురవడంతో ధాన్యం తడిపోయింది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు కేంద్రాలకు తెచ్చిన తరుణంలో వర్షం వల్ల నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు వేడుకుంటున్నారు. శివ్వంపేటలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అవుతున్నా తూకం వేయలేదని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

తప్పని తిప్పలు

నర్సాపూర్: అకాల వర్షం కురువడంతో ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చిన రైతులకు తిప్పలు తప్పలేదు. ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పినా వర్షంనీరు లోపలికి వెల్లడంతో ధాన్యం కొట్టుకుపోయింది. వర్షం తగ్గిన అనంతరం కొట్టుకుపోయిన వడ్లను రైతులు ఎత్తుకొచ్చుకున్నారు. రోజులు గడుస్తున్నా తూకం పెట్టక ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రుస్తుంపేటకు చెందిన రైతు అనిల్ మాట్లాడుతూ 25రోజుల క్రితం నర్సాపూర్‌లోని కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చి ఎండపెట్టినా ఇంత వరకు తూకం వేయలేదని, వడ్లు మొలకలొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.


శివ్వంపేటలో నీటిని తొలగిస్తున్న రైతు